56)రామక్రియ / అఠాణ

ప॥ ఎవ్వడోకాని యెఱుగరాదు కడు । దవ్వులనే వుండు తలపులో నుండు ॥

చ॥ యెడయవు తనరెక్క లెగసి పోలేడు । కడు దాగుగాని దొంగయు గాడు ।
వడి గిందుపడును సేవకుడునుగాడు । వెడగుగోళ్ళ వెంచు విటుడును గాడు ॥

చ॥ మిగుల బొట్టివాడు మింటికిని బొడవు । జగడాలు తపసి వేషములును ।
మగువకై పోరాడు మరి విరక్తుండును । తగు గాపుబనులు నెంతయు దెల్లదనము ॥

చ॥ తరుణుల వలపించు దగిలి పైకొనడు । తురగము దోలు రౌతును గాడు ।
తిరువేంకటాద్రిపై దిరుగు నెప్పుడును । పరమమూర్తియై పరగు నీ ఘనుడు ॥